# కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

**ఈవీఎంలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చూసి సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్**

కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పటాన్‌చెరు, మే 25 : రుద్రారం గీతం యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రంలోని ఏర్పాట్లను కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. శనివారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గీతం యునివర్సిటీలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. గీతంలోనే కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలో భారికెడ్లు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్‌అండ్‌బీ, ఇంజినీరింగ్ అధికారులు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారులు తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి, పోలింగ్ ఏజెంట్లకు వేర్వేరుగా మార్గాలు సిద్ధమయ్యాయని వారన్నారు. కౌంటింగ్ వద్ద అన్ని సజావుగా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. గీతం యునివర్సిటీలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంను భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతను కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రం వద్ద పోలీసు భద్రతను, సీసీ కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్ రికార్డులను, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను, స్ట్రాంగ్ రూమ్ కంట్రోల్ రూమ్ రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతను కొనసాగించాలని సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కంగ్టి తహసీల్దార్ విష్ణుసాగర్, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ రవీందర్, సర్వేయర్ కోటేశ్వర్‌రావు, డీఎస్‌పీ సత్తయ్య, సీఐ నయిముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

### పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

పటాన్‌చెరు, మే 25 : పాశమైలారం యూపీఎస్ పాఠశాలను కలెక్టర్ వల్లూరి క్రాంతి తనిఖీ చేశారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామంలోని అప్ప ర్ ప్రైమరీ పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శపాఠశాల పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఏ పీఆర్ మల్లేశ్‌ను, ఎంఈవో పీపీ రాథోడ్‌ను కలెక్టర్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో యాదగిరి, ఎంఈవో పీపీ రాథోడ్, ఏఈ పీఆర్ మల్లేశ్, కార్యదర్శి రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 25 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా రెవెన్యూ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు, ధరణి దరఖాస్తుల పరిష్కారం, ప్రజావాణి దరఖాస్తులు తదితర అంశాలపై సమీక్షించారు. ఏ కేంద్రంలో కూడా 60 నుంచి 70 మంది రైతులు ఒకేసారి వచ్చే పరిస్థితి తీసుకురావద్దని హితవు పలికారు. మిల్లుల వద్ద లారీలు వెంటనే ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాల్లో రైస్ మిల్లర్ల వద్ద డేటా ఎంట్రీ ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసి రైతులకు బిల్లు అందించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# గురుకుల విద్యార్థినికి నగదు బహుమతి

శిరీష(ఫైల్)

కోహీర్, మే25 : జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల్లో బైపీసీలో 1000 మార్కులకు 990 మార్కులు సాధించి ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన శిరీషకు ఆ సొసైటీ తరపున శనివారం నగదు బహుమతి ప్రకటించింది. రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచినందుకు సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల ఆధ్వర్యంలో శిరీషకు రూ.25వేల నగదును అందజేసింది. ము నిపల్లి మండలంలోని పెద్దలోడి గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లీలావతి శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్‌సీవో భీమయ్య, ప్రిన్సిపాల్ లలితమ్మ, అధ్యాపకులు విద్యార్థిని శిరీషను అభినందించారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఝరాసంగం : చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ

సంగారెడ్డి : మాట్లాడుతున్న జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జయంతి

ఝరాసంగం, మే 25 : జూన్ 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె. సూరి కృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను బాధితులకు, కక్షదారులకు తెలియజేసి రాజీమార్గం ద్వారా కేసులు సత్వర పరిష్కారం చేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. బార్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రెసిండెంట్ మాణిక్, న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, తహసీల్దార్ సంజీవరావు, ఆర్‌ఐ రామరావు, పోలీసులు పాల్గొన్నారు.

### సంగారెడ్డిలో..

సంగారెడ్డి, మే 25 : కేసులకు న్యాయవాదులకు ఫీజులు చెల్లించలేని పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సేవలు అందిస్తుందని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జయంతి సూచించారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్యానెల్ న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి జయంతి మాట్లాడుతూ సమాజంలో కోర్టుల్లో కేసులు వేసేందుకు ఆర్థికస్థోమత లేని పేదలకు ఉచిత న్యా య సేవలు అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తుందన్నారు. పేదవారికి ఉచిత న్యాయసేవలు అందించేందుకు ప్యానెల్ న్యాయవాదులతో వారికి కేటాయించిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బొంతపల్లి స్క్రాప్‌గోదాంలో భారీ అగ్నిప్రమాదం

ఎగిసిపడుతున్న మంటలు

గుమ్మడిదల, మే 25 : పారిశ్రామికవాడలో ఓస్క్రాప్‌గోదాంలో ఒక్కసారిగా అగ్ని మంటలు ఆకాశనంటుతూ ఎగిసిపడుతుండడంతో స్థానికులు భయంభోళనకు గురయ్యారు. గోదాంలో భారీగా కెమికల్‌డ్రమ్ములు నిల్వ ఉండడంతో ఎగిసిపడి బాం బుల చప్పుడు గోచరించింది. దీంతో స్థానికులు ఎక్కడ నుంచి ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయభ్రాంతులకు గురైయ్యారు. బొంతపల్లి పారిశ్రామికవాడలోని దార్ల దాచారం సమీపంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన వ్యక్తులు స్క్రాఫ్‌గోదాంను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇందులో భారీగా స్థానిక పరిశ్రమలనుంచి తెచ్చిన కెమికల్ డ్రమ్ములు నిల్వ ఉంచడంతో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు అగ్నిపంటలు సంభవించాయి. ఎవరికి ఎలాంటి ప్రాణ పాయం జరుగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భారీస్థాయిలో స్క్రాఫ్‌గోదాను ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు, మే 25 : ఇస్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఇస్నాపూర్ ఏడీ ఈ తుల్జారాం సింగ్ శనివారం తెలిపారు. ఆదివారం ఉద యం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. ముత్తంగి గ్రామంలోని డీఎన్ కాలనీ, న్యూటౌన్ కాలనీ, ముత్తంగి, గణపతిగూడెం, పోచారం, పాశమైలారం గ్రామంలో, ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని అన్ని కాలనీల్లో వి ద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. సహకరించాలని ఏడీఈ కోరారు.

# నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి : సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నర్సింహారావు

న్యాల్‌కల్, మే 25 : నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి లావణ్య సూచించారు. శనివారం మండలంలోని రేజింతల్, రాంతీర్థం, తాట్‌పల్లి, టేకూర్, కల్‌బేమల్, అత్మూర్, హుమ్నపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వ్యవసాయాధికారులు నకలీ విత్తనాల పట్ల తీసుకునే జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈవోలు సాయిలు, షరీఫ్, హీనా, నిఖిత, అర్చన, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### మనూరులో..

మనూరు, మే 25 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రలోని ఫర్టిలైజర్‌తో పాటు రాయిపల్లి ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన నాణ్యమైన పత్తి విత్తనాలు మాత్రమే రైతులకు అమ్మాలని ఫర్టిలైజర్ దుకాణాల యజమానులకు సూచించారు. ఫర్టిలైజర్ నిర్వాహకుడు మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### హత్నూరలో..

హత్నూర, మే 25 : వానకాలం సీజన్‌లో రైతులు సాగుచేసే పత్తిపంట కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. హత్నూర మండలం పన్యాల, సాదుల్లానగర్ గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించి పత్తివిత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏవో శ్రీనివాస్, ఏఈవో వరప్రతాప్ పాల్గొన్నారు.

### ఝరాసంగంలో..

ఝరాసంగం, మే 25 : నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి నష్ట పోవద్దని రైతులకు మండల వ్యవసాయ అధికారి వెంకటేశం సూచించారు. శనివారం మండల పరిధిలోని ఈదుల పల్లి, తుమ్మూన్‌పల్లి, పోట్టిపల్లి, కృష్ణపూర్, ఏడాకులపల్లి గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై రైతులు, విత్తన డీలర్లకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు సుకుమార్, హరికృష్ణ, వినోద్ కుమార, సంపత్, మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

### రైతులకు కచ్చితంగా రసీదు ఇవ్వాలి

నాగల్‌గిద్ద, మే25 : నాసీరకం విత్తనాలు, నకిలీ విత్తనాలు పంపిణీ చేస్తే డీలర్లపై చర్యలు తప్పవని వ్యవసాయ విస్తారణ అధికారి వెంకటేశం అన్నారు. శనివారం మండలంలోని రైతువేదికలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

### అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

కోహీర్, మే 25 : ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను రైతులకు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి నవీన్ కుమార్ హెచ్చరించారు. కోహీర్ పట్టణంలోని రైతు వేదికలో ఆయా గ్రామాల ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమార్పీ ధరకే విక్రయించాలన్నా రు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. సమావేశంలో ఏఈవోలు శ్రీనివాస్, మౌనికవర్మ, సంధ్య, వేదవతి, సవిత, స్వాతిరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

### గుమ్మడిదలలో..

గుమ్మడిదల,మే 25 : విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రైతులకు అవగాహన సదస్సులో తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, అన్నారం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కలిగించారు. కొత్తపల్లిలో మండలవ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఏఈవో అస్మిత, అన్నారంలో ఏఈవో నిఖిత రైతులకు అవగాహన కలిగించారు.

## వ్యవసాయాధికారులు

### నాణ్యమైన విత్తనాలనే విక్రాయించాలి

వట్‌పల్లి, మే 25 : రైతులకు నాణ్యమైన విత్తనాలను మత్రమే విక్రయించాలని ఏడీఏ సత్యానారయణ ఫర్టిలైజర్ దుకాణ దారులకు వివరించారు. మండల పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి మహేశ్ చౌహన్, ఏఈవోలు పాల్గొన్నారు.

### జాగ్రత్తలు తీసుకోవాలి

అందోల్, మే 25 : రైతులు విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకొని అధికారుల సూచనల మేరకు పంటలను సాగుచేయాలని మండల వ్యవసాయ అధికారిణి విజయరత్న సూచించారు. మండలంలోని అన్నాసాగర్‌తో పాటు పలు గ్రామాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి విత్తనాల కొనుగోళ్లపై అవగాహన కల్పించారు. ఏఈవోలు పాల్గొన్నారు.

### సంగారెడ్డిలో..

సంగారెడ్డి, మే 25 : మండల పరిధిలోని కులబ్‌గూర గ్రామంలో విత్తనాల కొనుగోళ్లపై అన్నదాతలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా అధికారి నర్సింహారావు మాట్లాడుతూ కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వట్‌పల్లిలో ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ సత్యనారాయణ

# అంతర్ జిల్లా టోర్నీలో మెదక్ అదుర్స్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 25 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ క్రికెట్ మైదానంలో జరుగుతున్న టీ-20 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు దూసుకెళ్తున్నది. ఈ నెల 24న జరిగిన మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టుపై మెదక్ జిల్లా జట్టు విజయం సాధించగా, తాజాగా, శనివారం వరంగల్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన మెదక్ జిల్లా జట్టు నిర్ధారిత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. ఇందులో అర్చాజ్ 84 పరుగులు చేసి నాట్ అవుట్‌గా నిలువగా, సందీప్ రాజ్ 51, శ్రీధర్ 46 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన వరంగల్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 151 పరుగులు మాత్రమే చేసింది. వరంగల్ బ్యాటింగ్‌లో శ్రీచరణ్ 42, అఖిల్ 44 పరుగులు చేశారు. మెదక్ జట్టు బౌలింగ్‌లో శ్రీధర్ 3 వికెట్లు తీశాడు. 55 పరుగుల తేడాతో మెదక్ జట్టు విజయం సాధించింది. ఆదివారం మెదక్ జట్టు కరీంనగర్ జట్టు మధ్య పోటీ జరుగనున్నదని మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి తెలిపారు.

# సమాజ శ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

జ్యోతిప్రజ్వల చేస్తున్న ప్రముఖులు

రామచంద్రాపురం, మే 25 : సమాజశ్రేయస్సుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచార ప్రముఖ్ బోయిని శ్రీనివాస్, దిఆర్గనైజర్ వారపత్రిక దక్షిణ మధ్య బ్యూరో చీఫ్ కుంటి సురేందర్ అన్నారు. శనివారం దేవర్షి నారద మహర్షి జయంతి సందర్భంగా సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి సచిదానంద ఆశ్రమంలో ప్రపంచ పాత్రికేయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ప్రముఖులతో జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కుంటి సురేందర్ మాట్లాడుతూ జాతీయ వాద జర్నలిజం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం అని చెప్పారు. అంతకు ముందు విద్యాభారతి స్కూల్ విద్యార్థులతో జాతీయ గీతాన్ని ఆలపించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నగర ప్రముఖ్ అరవింద్, మనోజ్, పారిశ్రామికవేత్త, ఆశ్ర మం ట్రస్టీ మెంబర్ అమితావిజయ్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

గజ్వేల్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

గజ్వేల్, మే 25: రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, పరుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ పురుషోత్తంరెడ్డి హెచ్చరించారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో నిల్వ ఉన్న విత్తనాలు, మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేయాలని చూస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండి వ్యవసాయాధికారులు సూచించిన విత్తనాలు, పురుగుల మం దులనే కొనుగోలు చేయాలన్నారు. తనిఖీల్లో లక్ష్మి బాలాజీ ట్రెడర్స్, పవనసుత ట్రెడర్స్, శ్రీసాయి ఫర్టిలైజర్స్ దుకాణాల్లో పట్టుబడిన మెంతులు, గంగవాయిలు కూర, బీర్నిస్, వరి ధాన్యం కాలం చెల్లిన మందులు తదతర వాటిని సీజ్ చేసి దాదాపు 610కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకొని ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజులకు అప్పగించారు. కార్యక్రమంలో సీఐ సైదా మరియు సిబ్బంది ఉన్నారు.

# జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

హత్నూర, మే25 : హత్నూర మండలం ముచ్చర్ల గ్రామంలో నిర్వహించే నల్లపోచమ్మ జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్ శనివారం విడుదల చేశారు. ఈసందర్భంగా మాజీస ర్పంచ్ అనితయాదగిరి,ఎంపీటీసీ కిషన్‌రావు మాట్లాడుతూ గ్రామంలో నల్లపోచమ్మ జాతర ఉత్సవాలు ఈనెల 29 నుంచి 31 వరకు అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న గంగస్నానం, 30న దేవుని లగ్నం, బోనాలు, ఎడ్లబండ్ల ఊరేగింపు, 31న పాచిబండ్ల ఊరేగింపు, ఒగ్గుకథ నిర్వహించనున్నారు.

# తల్లిదండ్రులకు గుడికట్టిన తనయులు

గుడి కట్టి ప్రతిష్టించిన కొమురవ్వ-కనుకయ్య దంపతుల విగ్రహాలు

అక్కన్నపేట, మే 25: తల్లిదండ్రులను పట్టించుకోని నేటి రోజుల్లో ముగ్గురు అన్నదమ్ములు జన్మనిచ్చిన తల్లిదండ్రులను స్మరిస్తూ వారి కోసం గుడి కట్టించి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. అక్కన్నపేటకు చెందిన గొట్టె కొమురవ్వ కనుకయ్య దంపతులకు సదయ్య, మహేందర్, చిరంజీవి ముగ్గురు సంతానం. నాలుగేండ్ల క్రితం కొమురవ్వ అనారోగ్యంతో మృతి చెందింది. ఏడాది క్రితం కనుకయ్య పాము కాటుతో చనిపోయాడు. తల్లిదండ్రుల మరణాన్ని తట్టుకోలేని అన్నదమ్ములు వారిని సజీవంగా చూసే విధంగా వ్యవసాయ బావి వద్ద విగ్రహాలను ప్రతిష్టించారు. కనుకయ్య ప్రథమ వర్ధంతి, కొమురమ్మ నాలుగో వర్ధంతిని పండుగ వాతావరణంలో నిర్వహించి బంధువుల సమక్షంలో విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం గుడిలో తల్లిదండ్రులకు పూజలు చేశారు. గ్రామస్తులు, బంధువులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతిఏటా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవాకార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

# ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ ధ్వజం

సమావేశంలో మాట్లాడుతున్న అతిమేల మాణిక్

సంగారెడ్డి, మే 25 : ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ దందా బంద్ చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం వెంటనే తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఫీజుల నియంత్రణపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మానిక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు చేలరేగిపోతున్నాయని అగ్రహం వ్యక్తంచేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం లేక పోవడంతో ఒక ఎల్‌కేజీ విద్యార్థికి రూ.50 వేల నుంచి రూ. 2లక్షల వరకు ఫీజులు వసూల్ చేస్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొందన్నారు. ఫీజుల నియంత్రణపై స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు విష్ణువర్ధన్, రాహుల్, రవి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణ కోసం చర్యలు

పలుగు తండాలో నీటి సమస్యను సమీక్షిస్తున్న ఎంపీడీవో, అధికారులు

నారాయణఖేడ్, మే 25 : మండలంలోని పలు తండాలు, గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నాలుగు నెలలుగా తరచూ నీటి సమస్య తలెత్తి ఇబ్బందులకు గురవుతున్నామని పలు గ్రామాల ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన మేరకు శనివారం ఎంపీడీవోతో పాటు ప్రత్యేకాధికారి రాకేశ్, పలుగు తండాను సందర్శించి నీటి సమస్యకు గల కారణాలను ఆరా తీశారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా కోసం ఇప్పటికే నిధులు మంజూరు చేశామని, జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ అధికారులకు తెలిపారు. ప్రస్తుత ఎండా కాలంలో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలను వేగవంతం చేసి నీరు సరఫరా అయ్యే విధంగా చూడాలని జడ్పీటీసీ కోరారు.

# ఎన్నికల నియమావళిని పాటించాలి

సూచనలు చేస్తున్న ఏసీపీ సతీశ్‌కుమార్

చేర్యాల, మే 25 : ప్రజలు, ప్రజాప్రతినిధులు, గ్రాడ్యుయేట్స్ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్‌కుమార్ కోరారు.చేర్యాల సర్కిల్ పరిధిలోని చేర్యాల,కొమురవెల్లి,మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా విధులు నిర్వహించే రూట్ మొబైల్ అధికారులు, సిబ్బంది, పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి చేర్యాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎన్నికల ముందు, ఎన్నికలు జరిగే రోజు(రేపు, ఎల్లుండి)నిర్వహించాల్సిన విధుల గురించి ఆయన దిశానిర్దేశం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని, పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ సామగ్రిని వదిలి వెళ్లవద్దన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపుకూడవద్దన్నారు. సమావేశంలో చేర్యాల సీఐ శ్రీను, చేర్యాల,మద్దూరు, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ ఎస్సైలు దామోదర్, యూనస్ అహ్మద్‌అలీ, మహేశ్, వివేక్, తిరుపతి, రూట్ మొబైల్ అధికారులు, సిబ్బంది, పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కనికరం లేని పంచాయతీ కార్యదర్శి



దరఖాస్తును చూపిస్తున్న బాధితుడు లక్ష్మణ్

అక్కన్నపేట, మే 25: మండలంలోని మోత్కులపల్లి పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌కు కనికరం లేకుండా పోయింది. ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డులో డేటా బర్త్‌ను సవరణ చేసేందుకు చుక్కలు చూపిస్తున్నాడు. బాధితుడు గుండవేని లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. తమ కుమారుడు అంజి ఎస్సెస్సీ మెమో పోల్చుకుంటే ఆధార్ కార్డులో మూడు నెలల వయస్సు తేడా ఉందని, ఈ విషయంపై లేట్ రిజిస్ట్రేషన్ బర్త్ అప్లికేషన్‌తో పాటు తమ కుమారుడి ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ప్రభుత్వ ఉద్యోగుల వాంగ్మూలం, రిజిస్టరు కానట్లు ఇచ్చే ధ్రువ పత్రం, అఫడవిట్‌ను పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌కు దరఖాస్తు చేశామన్నారు. అయితే మొదట రిజిస్టరు కానట్లు ఇచ్చే ధ్రువ పత్రంలో వివరాలు నింపి, తర్వాత ఎంపీవో కవికుమార్ ఆదేశాల మేరకు ధ్రువపత్రం ఇవ్వకూడదంటూ మెలిక పెట్టాడు. ఎందుకు ఇవ్వరాదో చెప్పండి లేదా లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వమని కోరినా స్పందించడం లేదని వాపోయాడు. చివరికి శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో పనితీరుపై బాధితుడు నిరసన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై ఎంపీడీవో భానోతు జయరామ్‌ను వివరణ కోరగా ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందని, ధ్రువీకరణ పత్రం ఇవ్వడంలో ఎలాంటి అభ్యంతరం లేదని కార్యదర్శికి సూచించినట్లు చెప్పారు.

## జనుము విత్తనాలు పంపిణీ

కోహీర్, మే 25 : కోహీర్ పట్టణంలోని రైతు సేవా కేంద్రంతో పాటు పీచెర్యాగడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార స